క్లుప్తంగా

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు స్థానిక సమస్యలపై అర్జీలు అందివచ్చని కోరారు.

నేడు అన్న క్యాంటీన్లలో ఆహారం అందుబాటులో ఉండదు

నెహ్రూనగర్: అన్న క్యాంటీన్లలో సోమవారం ఆహారం అందుబాటులో ఉండదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం అందించడానికి అక్షయ పాత్ర సంస్థ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సోమవారం అన్న క్యాంటీన్లకు ఆహార సరఫరా నిలిపివేయడం జరిగిందన్నారు.

విజయవాడకు కార్పొరేషన్ సాయం

నెహ్రూనగర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విజయవాడ నగర ప్రజలు అతలాకుతలమవుతున్నారని, వారికి అండగా గుంటూరు నగరపాలక సంస్థ నిలుస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు 60 వేల పాల ప్యాకెట్లు, లక్ష బిస్కెట్ ప్యాకెట్లు, 30 వేల వాటర్ బాటిళ్లు, 900 బ్రెడ్ ప్యాకెట్స్‌ని ఆదివారం రాత్రి ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపించినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో చతుర్థశి, మాసశివరాత్రి సందర్భంగా ఆదివారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఐపీఎం డిపార్ట్‌మెంట్‌కు వన్నెతెచ్చిన వ్యక్తి గౌస్



గుంటూరు మెడికల్: ఐపీఎం డిపార్ట్‌మెంట్‌కు గౌస్ మొహిద్దీన్ వన్నె తీసుకొచ్చారని పలువురు అధికారులు, ఉద్యోగులు కొనియాడారు. ఆదివారం గుంటూరు నగరం శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ల్లో జాయింట్ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు అధ్యక్షతన గౌస్ మొహిద్దీన్ పదవి విరమణ అభినందన సభ జరిగింది. ఐపీఎం డిపార్ట్‌మెంట్‌లో ఎంతో ప్రాధాన్యం కలిగిన ఆహార కల్తీ విభాగంలో ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా గౌస్ మొహిద్దీన్ 39 సంవత్సరాలుగా విధినిర్వహణలో తనదైనశైలిలో చట్టాలను అమలు చేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐపీఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఒంగోలు ప్రభాకర్‌రావు, సప్పా శ్రీనివాస్, నెల్లూరు వెంకటేశ్వరరావు, మాజీ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ విశ్వనాథరెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు శ్రీకాంత్, రవీంద్రారెడ్డి, గోపాలకృష్ణ, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, కావ్య రెడ్డి, రామరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన ఎముకలు



లక్ష్మీపురం: ఎముకలకు సంబంధించిన సమస్యలలో ఆస్టియోపొరోసిస్ ఒకటి అని, ఈ వ్యాధి ఎక్కువగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులలో కనిపిస్తుందని, ఆస్టియోపొరోసిస్ సమస్య ముఖ్యంగా ఆడవారిలో మెనోపాజ్ అయిన తర్వాత హార్మోన్ సమతుల్యం దెబ్బతినడం వల్ల వస్తుందని ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల ఆర్థోపెడిక్ సర్జన్ సి.హెచ్.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆస్టియోపొరోసిస్ సమస్య సాధారణంగా శారీరక శ్రమ లేకపోవడం, విటమిన్ డి లోపం వలన వస్తుందనిచెప్పారు. అనంతరం డాక్టర్ సిహెచ్ విజయ్ కుమార్‌ని ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ముప్పాళ్ల ప్రసాదరావు, చలమా రెడ్డి పాల్గొన్నారు.











వర్షం నీటిని బయటకు పంపిన అనంతరం కార్పొరేషన్ కార్యాలయం



శాంతించిన వరుణుడు

వరుణుడు శాంతించాడు. గుంటూరు నగరం తెరుకుంటుంది. పల్లపు ప్రాంతాల్లో శనివారం వర్షం ధాటికి మునిగిన కాలనీలు తెరుకుంటున్నాయి. నగరంలో లోతట్టు ప్రాంతాల వారిని తరలించేందుకు ఏడు సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ కార్యాలయంతో పాటు ప్రధాన కార్యాలయాలు కూడా నీటమునిగిన విషయం తెలిసిందే. పేదలు అటు ఇళ్లల్లో ఉండలేక... ఇటు బయటకు పోలేక నానా అవస్థలు పడ్డారు. నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో నగరం నీటమునిగింది. ఆదివారం ఉదయం వరకు వర్షం కురుస్తున్నప్పటికి మధ్యాహ్నానికి కాస్తంత తెరపించడంతో నగర వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించాలి

కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాల్లో నీటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బీఆర్ స్టేడియం, శ్రామిక నగర్, ముగ్దుం నగర్, బాలాజీ నగర్ మొండి గేటు తదితర ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సదరు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. బాలాజీ నగర్ దగ్గరలోని మొండి గేటుని పరిశీలించి, సదరు ప్రాంతం నగరంలోని అధిక శాతం డ్రైన్ల ద్వారా వచ్చే నీరు వెళ్లే మార్గమని, అక్కడ ఎటువంటి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.

బీఆర్ స్టేడియంలో నిలిచిన నీటిని పరిశీలించి, స్టేడియం వెలుపల ప్రతిపాదనలో ఉన్న డ్రైన్ నిర్మాణ పనులను చేపట్టాలని ఏఈని ఆదేశించారు. స్టేడియం అధికారులతో సమన్వయం చేసుకొని స్టేడియం లోపల డ్రెయిన్, వెలుపల వైపు ప్రతిపాదించిన డ్రెయిన్ లెవల్స్ సరి చూసుకోవాలని చెప్పారు. శ్రామిక నగర్‌లో ఇళ్లల్లోకి వర్షం నీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలుపగా, పరిశీలించి వెంటనే కచ్చా కాల్వ చేసి నీటిని తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే డ్రెయిన్ మార్గాల్లో అడ్డుగా నిర్మాణాలు చేసుకోకూడదని ప్రజలకు సూచించారు. ఈ పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వర రావు, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్, ఎస్ఎస్ అయుబ్ ఖాన్, కార్పొరేటర్లు మహమూద్, మీరావలి, చిస్తి పాల్గొన్నారు.



నీటి మునిగిన ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

డ్రెయిన్లపై ఆక్రమణలపై ఆగ్రహం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై ఆక్రమణలు ఇష్టానుసారం చేస్తున్నారని ఫలితంగా ప్రస్తుత వర్షాలకు డ్రెయిన్లు బ్లాక్ అయి వర్షం నీరు ఇళ్లల్లోకి, లోతట్టు ప్రాంతాలకు చేరి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం జీటీ రోడ్, శ్రీనివాసరావు తోట, పాత గుంటూరు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, డ్రైన్ల ఆక్రమణలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో తొలగించాలన్నారు. సోమవారం నాటికి ఆక్రమణలు తొలగించాలని లేకుంటే సంబంధిత అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం లాల్‌పురం రోడ్ లోని ఓ పెట్రోల్ బంక్‌లో మీటర్ ఏర్పాటు చేయడానికి ముందే ట్యాప్ కనెక్షన్ చేసి ఉండడం గమనించి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ట్యాప్ కనెక్షన్ తొలగించాలని, నిబంధనల మేరకు విధులు నిర్వహించకుండా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈ సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీధర్, డీసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

నెహ్రూనగర్: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయం కీలకమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలో కురుస్తున్న వర్షాల వలన ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక కార్పొరేటర్లతో ఆదివారం కమిషనర్ ప్రత్యేకంగా టెలి కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు స్థానిక ఆయా విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపుకు గురైన వారికి జీఎంసీ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ప్రజాప్రతినిధులు కూడా ప్రజలకు కేంద్రాల సమాచారం తెలియజేయాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వెలాంగణిరాజు, కట్టెబోయిన నరసింహారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ ఒకటో తేదీని విద్రోహ దినంగా పాటిస్తూ ఆదివారం లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఎల్లప్పుడూ పాత పెన్షన్ విధానానికి కట్టుబడి ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లకు వ్యతిరేకమని తెలిపారు. ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం ఎటువంటి సామాజిక భద్రత కల్పించని ఏ పెన్షన్ విధానాన్నైనా ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం ఉద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోవడం పరిపాటైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మోపిదేవి శివశంకర్, పి.రమేష్, భాస్కరరావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన ఏపీటీఎఫ్ నాయకులు

డాక్టర్ సుబ్రహ్మణ్యం రాజు సేవలు విలువైనవి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారిగా (డీసీహెచ్) పనిచేస్తున్న డాక్టర్ కొండూరు సుబ్రహ్మణ్యం రాజు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం రాజును గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ సుబ్రహ్మణ్యం చేసిన సేవలను కొనియాడారు. తెనాలి గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్లు హనుమంతరావు, మజీదాబి, ఇతర డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ సుబ్రహ్మణ్యం రాజు సేవలను కొనియాడారు.



సన్మాన సభకు హాజరైన అతిథులు

పాత పెన్షన్ విధానాన్నే అంగీకరిస్తాం

ఏఐఎస్‌టీఎఫ్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు

గుంటూరు వెస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం తప్ప మరేదీ అంగీకరించమని ఏఐఎస్‌టీఎఫ్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సిహెచ్.జోసఫ్ సుధీర్ బాబు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ ముందు పెన్షన్ విద్రోహ దినం పాటించారు. ఆయన మాట్లాడుతూ 2004లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ స్థానంలో సీపీఎస్‌ను తీసుకొచ్చారన్నారు. అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిరసనలు చేస్తూనే ఉన్నాయని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ స్కీమ్(యూపీఎస్) ను తీసుకొచ్చిందని దీనిని కూడా తాము అంగీకరించమని స్పష్టం చేశారు. దీంతోపాటు ప్రాథమిక విద్యా విధానాన్ని నీరుగార్చే జీఓ నంబర్ 117 వెంటనే రద్దు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు మీడియాన్ని అమలు చేయాలని తెలిపారు. 12వ పీఆర్సీ ఆలస్యమవుతున్నందున 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర మహిళా కన్వీనర్ సిహెచ్ ఉమ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు నిరసన చేస్తున్న ఏఐఎస్‌టీఎఫ్ నాయకులు

వక్ఫ్ సవరణ బిల్లుపై తెలుగులో సూచనలిచ్చే అవకాశం ఇవ్వండి

వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రజలు తెలుగులో సూచనలు ఇచ్చే అవకాశం కల్పించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం దుగ్గిరాలలో విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుపై సూచనలను కేంద్రం ఆహ్వానించిందని, వీటిని 15 రోజుల్లోగా ఆంగ్లం లేదా హిందీ భాషల్లో జాయింట్ సెక్రటరీ లోక్‌సభ సెక్రటేరియట్, రూమ్ నంబర్ 440 పార్లమెంట్ హౌస్ అనెక్స్, న్యూఢిల్లీ చిరునామాకు లేదా jpcwaqf-lss@sansad.nic.in ఈమెయిల్‌కు పంపాలని సూచించిందని వివరించారు. తెలుగు, ముస్లింల మాతృభాషలోనూ సూచనలకు అవకాశం కల్పించాలని కోరారు.

థర్డ్ స్పేస్ ఎండోస్కోపిక్‌పై వర్క్ షాప్

గుంటూరులో తొలిసారి జీజీహెచ్‌లో నిర్వహణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జీజీహెచ్‌లో పార్వల్ ఎండోస్కోపిక్ మయాటమీ(పోయమ్) లైవ్ వర్క్‌షాపు నిర్వహించారు. జీర్ణం కోసం అన్నవాహికలోని సునిశితమైన ప్రాంతాల్లో చికిత్సలు చేసే థర్డ్ స్పేస్ ఎండోస్కోపిక్‌పై లైవ్ వర్క్ షాప్ నాలుగు కేసులకు నిర్వహించారు. గుంటూరు జీజీహెచ్ సెమినార్ హాల్లో నిర్వహించిన ఈ వర్క్ షాప్‌కు ముఖ్యఅతిథులుగా గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్ బాబు, డాక్టర్ గోవింద నాయక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ కవిత, డాక్టర్ నాగూర్ బాషా, డాక్టర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్ షాప్‌కు ఫ్యాకల్టీగా సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ అప్పసాని, హైదరాబాద్ స్టార్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ వై.రామిరెడ్డి, మణిపాల్ హాస్పిటల్(విజయవాడ)కు చెందిన డాక్టర్ రాజేష్ హాజరయ్యారు. గెస్ట్ ఫ్యాకల్టీలు మాట్లాడుతూ ఆహారాన్ని సజావుగా మింగని పరిస్థితుల్లో ఎండోస్కోపీ ద్వారా పీఓఈఎం(పెరోరల్ ఎసోఫాగెల్ మైటమి) చికిత్స చేస్తారని ఈ సమస్యకు గతంలో ఆపరేషన్లు నిర్వహించేవారని చెప్పారు.

జీర్ణకోశ వ్యవస్థలో క్యాన్సర్లు కనబడినప్పుడు గతంలో ఆపరేషన్ ద్వారా వాటిని తొలగించడానికి అవకాశం ఉండేదని ఇప్పుడు ఈఎస్‌డీ(ఎండోస్కోపిక్ సబ్ మ్యూకోసల్ డిసెక్షన్) ద్వారా వాటిని తొలగించే అవకాశం వచ్చిందన్నారు. గుంటూరు జీజీహెచ్ ఈ తరహా కేసులను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని చెప్పారు. మహానగరాలకే పరిమితమై ఉన్న అత్యంత అధునాతనమైన వైద్య చికిత్సలు జీజీహెచ్‌లో కూడా అందుబాటులో ఉన్నాయని వైద్య ప్రపంచానికి ప్రజలకు తెలియ చెప్పటానికి ఈ వర్క్ షాప్ నిర్వహించామని డాక్టర్ కవిత తెలిపారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ నాగూర్‌బాషా మాట్లాడుతూ తిన్న ఆహారం పొట్టలోకి వెళ్లకుండా జంక్షన్‌లో ఉంటే గతంలో ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ చేసేవారని చెప్పారు. ఈ సమస్యను ఎకలెక్సియా కార్డియా అంటారని నేడు కొత్త ప్రొసీజర్ పోయమ్ ద్వారా ఎలాంటి కోత, కుట్లు లేకుండా మింగుడు సమస్యను నివారించవచ్చని చెప్పారు. అన్నం మింగుడు పడకపోవటం, చాతిలో పట్టుకోవటం, తిన్నదంతా ముక్కులోకి రావటం, విపరీతమైన దగ్గు లక్షణాలు ఉన్నవారికి జీజీహెచ్‌లో ఆదివారం లైవ్‌లో ఆపరేషన్లు చేశామన్నారు. ఈ ఆపరేషన్లకు ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్ష నుంచి లక్షన్నర రూపాయలు ఖర్చవుతుందని, జీజీహెచ్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నామని వెల్లడించారు. లైవ్ వర్క్ షాప్‌లో నలుగురికి ఆపరేషన్ చేసి వివరించారు. ఆపరేషన్ ప్రక్రియలో సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎన్.శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శివరామకృష్ణ, మత్తు వైద్య నిపుణులు పోలయ్య, హనుమంతరావు, డాక్టర్ ఆనంద్, పీజీ వైద్య విద్యార్థులు అనిల్, నవీన్ పాల్గొన్నారు .



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కవిత, పక్కన డాక్టర్ నాగూర్‌బాషా తదితరులు

నారాయణదాస జయంత్యుత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేది కపై ఎం.నారాయణ దాస కథాగాన కళాపరిషత్‌ఆధ్వర్యంలో శ్రీనారాయణ దాస 160వ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం హరికథా చూడామణి, పురాణం విజయలక్ష్మీ భాగవతారిణితో రుక్మిణీ కళ్యాణం హరి కథాగానం జరిగింది. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై ఎం.నగధరరావు వాయిద్యాన్ని అందించారు. సంస్థ అధ్యక్షులు కర్రా సూర్యనారాయణదాసు, తాడేపల్లి సింహాద్రిశాస్త్రి, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ అమ్మవారి జాతర



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు, గ్రామోత్సవం

నగరంపాలెం: స్థానిక కొబాల్డుపేట ఏడో వీధిలోని పోతురాజు సహిత పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అత్యంత వైభవంగా కొలుపులు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకారణ, అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అశోక్‌నగర్, దేవాపురం, బ్రాడీపేట ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను దేవస్థానం నిర్వాహకులు అందజేశారు. గ్రామోత్సవం దేవస్థానం నుంచి మొదలై కొబాల్డుపేట మీదగా బ్రాడీపేట, దేవాపురం, కొబాల్డుపేట 8వ వీధి మీదగా దేవస్థానం వరకు అంగరంగ వైభవంగా చేపట్టారు.

ఏపీ ఉన్నత విద్యామండలిని ప్రక్షాళన చేయాలి

లక్ష్మీపురం: ప్రభుత్వంలో ఉన్న అధికారులు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ఉన్నత విద్యా మండలి అధికారులుగా కొనసాగుతూ విద్యార్థి, ఉద్యోగులకు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్ మోహన్ రావు, కార్యదర్శి నజీర్ అహ్మద్‌ని తక్షణమే తొలగించి ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు కొంతమంది అధికారులు అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు.